మహిళా పక్షపాతి సీఎం జగన్




ఆసరా చెక్కులు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, జియ్యాని శ్రీధర్ తదితరులు, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ
- బుచ్చిరాజుపాలెంలో పండగ వాతావరణం

గోపాలపట్నం: మహిళల అభ్యున్నతి, ఆర్థిక ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, పార్టీ రీజనల్ జేసీఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్‌లు అన్నారు. అవినీతికి తావులేకుండా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకే పథకాల నగదు బదిలీ అవుతోందని, తద్వారా మహిళా పక్షపాతిగా సీఎం నిలిచారని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలోని 52, 56, 57, 89, 90, 91, 92 వార్డుల చెందిన లబ్ధిదారులకు బుధవారం 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజుపాలెంలో పండగ వాతావరణం నెలకొంది. ముందుగా అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'ఆసరా'తో అండగా..

హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆసరా పథకం ద్వారా మహిళలకు ముఖ్యమంత్రి జగన్ అండగా నిలిచారని అన్నారు. ఇప్పటి వరకు రూ.19 వేల కోట్లు ఆసరా ద్వారా బదిలీ చేశారని తెలిపారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 97 శాతం నెరవేర్చిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా పథం దోహద పడుతుందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు రూ.34.45 లక్షల పంపిణీ చేశారన్నారు. ఎస్‌ఏ రెహ్మాన్ మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిని చేస్తారనే నమ్మకముందన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా భరోసానిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళా నాయకులు క్షీరాభిషేకం చేశారు. సీఎం జిందాబాద్.. నువ్వే మా నాయకుడంటూ నినాదాలు చేశారు. పలువురు మహిళలు థాంక్యూ సీఎం ప్లకార్డులు ప్రదర్శించారు. జగనన్న నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

దేశ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సభా ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి ఆడారి ఆనంద్‌కుమార్, ఎస్‌ఏ రెహ్మాన్, హర్షవర్ధన్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మిలీనియం శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థాన పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, కార్పొరేటర్లు ముత్రు వాణీనానాజీ, పి.వి.సురేష్, పీడీ పాపునాయుడు, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు, పార్టీ వార్డు అధ్యక్షులు చుక్క ప్రసాదరెడ్డి, అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు నమ్మి శ్రీను, అయితంశెట్టి గోపి, పల్లా ఎర్నికుమార్, గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 63వ వార్డు ఏకేసీ కాలనీ సచివాలయం(1086321) పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, యువజన విభాగ నాయకుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. 450 గడపలను ఆడారి ఆనంద్‌కుమార్ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను, నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తెలియజేసి సత్వర పరిష్కార దిశగా సూచనలిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆడారి తెలిపారు. కార్యక్రమంలో 40, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, పి.రమణ, కొట్నాన రవి, జి.రమణమూర్తి, సూరాడ పెంటారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన స్టీల్‌ప్లాంట్ నాయకులు



చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలకు మద్దతివ్వాలని కోరుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు విశాఖ విమానాశ్రయంలోని టెర్మినల్ భవనంలో బుధవారం ఆయనకు నాయకులు మంత్రి రాజశేఖర్, అయోధ్య రామయ్య తదితరులు వినతి పత్రం అందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ని పోరాటాలు చేస్తున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు కలిశామని చెప్పారు. ఈ పోరాటాన్ని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా విస్తరిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కను బంధించి పట్టుకెళ్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని పల్లి వీధి, గొల్ల వీధి, మార్కెట్ లైన్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించారు. శునకాల స్వైరవిహారం రోజురోజుకూ అధికమవుతుండటంతో ఆయా ప్రాంతాలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వారు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకువెళ్లటంతో స్పందించిన ఆమె వీధి కుక్కల నివారణ చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను బంధించి పట్టుకెళ్లారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: అనుమానాస్పదంగా ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి ఆసవానిపాలెంలో బుధవారం జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆశవానిపాలెం పరిధి అశోకా పార్క్ రైల్వే ట్రాక్ సమీపంలోని గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడా.. మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు జార్ఖండ్, వెస్ట్ బెంగాల్ ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వాహా చేసిన నిధులు చెల్లించాలి



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ కన్జూమర్స్ స్టోర్ నిధులు రూ.33 లక్షలను తిరిగి చెల్లించాలని నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ సభ్యులు ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారం ముసుగులో థిఫ్ట్ రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని, వ్యాపార లాభాలను కొంత మంది డైరెక్టర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, వడ్డీ వ్యాపారాలకు వాడుకున్నారని ఆరోపించారు. కార్మికులు, సభ్యులను నట్టేట ముంచారని విమర్శించారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరిపై సీబీఐ, సీఐడీ విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కవులు క్రాంతదర్శులు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో కవి సమ్మేళనం జరిగింది. సాహితీవేత్త వి.ఆర్.ఎస్.సోమయాజులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కవులు సమాజ మార్గనిర్దేశకులు, క్రాంతదర్శులు, మానవతా మూర్తులని అభివర్ణించారు. కవుల కీర్తి వారి కావ్యాల ద్వారా తరతరాలకు నిలిచిపోతుందన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి కవులకు పుట్టినిల్లని, నాలుగు దశాబ్దాలుగా ఎందరో కవులు, రచయితలు తమ సంస్థ ద్వారా పరిచయమయ్యారని తెలిపారు. రచయిత కె.జి.వేణు సాహితీవేత్త కడియాల రామమోహనరావు గురించి పరి చయం చేస్తూ ప్రసంగించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



మాలధారులకు శూలాలు వేస్తున్న గురుస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాలరాజు కృష్ణ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి అష్టోత్తర, శత కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు కూడలి వరకు రథాన్ని ఊరేగించారు. స్వామి మాలధారులు శూలాలు ధరించి వేల్‌వేల్ మురుగన్ పేరుతో రథోత్సవంలో పాల్గొన్నారు.

బీవీపీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యామ్ శర్మ

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) జిల్లా, రాష్ట్ర కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం బీవీపీ జాతీయ స్థాయి కార్యదర్శి జనరల్ శ్యామ్ శర్మ ముఖ్య అతిథిగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ ప్రగతికి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సభ్యులంతా నిస్వార్థంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు దేశభక్తి కలిగించడం కోసం కృషి చేస్తున్న ఏకైక సంస్థ బీవీపీగా పేర్కొన్నారు. అనంతరం పరిషత్ విశాఖపట్నం ప్రాంత శాఖ, విశాఖపట్నం శాఖ, విశాఖ నారీ శాఖ, అనకాపల్లి శాఖ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమంలో జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్‌చంద్ జైన్, ప్రత్యేక ఆహ్వానితులు వంకాయల సన్యాసిరాజు, ఎం.వి.వి.సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఇదే..

భారత వికాస్ పరిషత్ విశాఖపట్నం ప్రాంత శాఖ అధ్యక్షుడిగా వంకాయల సన్యాసిరాజు, కార్యదర్శిగా జి.బి.వి.ఇ.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఎస్.కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. విశాఖ శాఖ అధ్యక్షుడిగా పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.భాస్కరరావు, కోశాధికారిగా జి.ఎస్.వి.మాణిక్యాలరావు, నారీ శాఖ అధ్యక్షురాలిగా వంకాయల సాయి నిర్మల, కార్యదర్శిగా ఎం.ఎస్.ఎల్.శైలజ, కోశాధికారిగా వి.భువన సుందరి, అనకాపల్లి శాఖ అధ్యక్షుడిగా ఎ.ఒ.రాము, కార్యదర్శిగా ఎస్.ఎ.బి.వర్మ, కోశాధికారిగా డి.శివరామ్ ప్రమాణ స్వీకారం చేశారు.

పిల్లల వికాసానికి తల్లిదండ్రుల తోడ్పాటు




ఇంద్రజాల ప్రదర్శనలో హరీష్ పట్నాయక్, తిలకిస్తున్న విద్యార్థులు

మురళీనగర్: పిల్లల్లో మానసిక వికాసానికి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఎ.లక్ష్మీరెడ్డి అన్నారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి అధ్యక్షతన మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు పరీక్షల నుంచి ఒత్తిడి లేకుండా వారికి మానసికోల్లాసానికి, విజ్ఞాన సముపార్జనకు ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చూడాలన్నారు. ఈ నెల పుట్టినరోజు జరుపుకుంటున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, జాలీవాకర్ ప్రకాష్, ఎన్.బుచ్చయ్య, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, సనపల పుష్పలత, కోశాధికారి సీహెచ్ లక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలానాయుడు, లలితారెడ్డి, వి.ప్రమీల , వివిధ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన

విద్యార్థుల మానసిక వికాసం, విజ్ఞానం, వినోదం కోసం ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా అలరించింది. ఇంద్రజాలికుడు ఆర్.హరీష్ పట్నాయక్ ప్రదర్శించిన వెంట్రిలాక్యులమ్ ఆకట్టుకుంది. పిల్లలతో విజ్ఞానం పెంపొందించే ఆటలు ఆడించారు. కార్యక్రమంలో బాలభాను, మురళీమాధవ, జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోదీ విధానాలపై ఐక్యపోరు

సీతమ్మధార: ప్రధాని మోదీ విధానాలపై ఐక్యపోరు కొనసాగిస్తామని, ఆయన ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ హెచ్చరించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ర్యాలీకి పది లక్షలకు పైగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు చేరుకున్నారన్నారు. ధర్నాకు ముందు మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్న తీరును తెలియజేస్తూ కళారూపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు ప్రసాద్, ఆర్.లక్ష్మణ మూర్తి, యు.రాజు, శ్రీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు జగ్జీవన్ రామ్

బాబూజీ జయంతి వేడుకల్లో వక్తలు



బాజి జంక్షన్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంఘ సభ్యులు



శాంతినగర్‌లో బాబూజీకి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ



ఆర్‌టీసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీటీసీ రాజారత్నం, అధికారులు

గోపాలపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. బాబూజీ జయంతి వేడుకలు నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 52వ వార్డు శాంతినగర్‌లోని కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జియ్యాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో..

రవాణా శాఖ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఉప రవాణా కమిషనర్ రాజారత్నం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్‌టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎంవీఐలు బాలాజీరావు, సత్యంనాయుడు, రౌఖిమున్నీషా, సిబ్బంది పాల్గొన్నారు.

బాజి జంక్షన్ ఎస్సీ కాలనీలో..

91వ వార్డు బాజి జంక్షన్ ఎస్సీ కాలనీలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తోటపోలమాంబ సేవా సంఘం , ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీళ్ల ఈశ్వరరావు, ఇండిగిబిల్లి ప్రసాద్, చెంగల వెంకటరమణ, శివశంకర్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో గల బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి 61, 62 వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక దళిత సంఘాల నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- 60వ వార్డులో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కార్పొరేటర్ పి.వి.సురేష్ నివాళి అర్పించారు.
- మల్కాపురం గ్రామం మండలి వద్ద జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సీపీఐ నాయకుడు కాండ్రేగుల సత్యంజనేయ, గాడాల రాంబాబు తదితరులు నివాళులర్పించారు.

దళితుల ఆశాజ్యోతి

కంచరపాలెం: దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ చేసిన కృషి అభినందనీయమని జైభీమ్ జయరామ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉప్పాటి అచ్చారావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మర్రిపాలెంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి కడితి కైలాస్, ముప్పిడి గౌరీప్రసాద్, ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడితి శివ, ముప్పిడి పోరన్న, యల్లబిల్లి గోవిందరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

62, 63 వార్డుల్లో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముఖ్య అతిథి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింగిపల్లి శ్రీనివాసరావు, కాకర రమణ, పెద్దాడ ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

- 63వ వార్డు కాకరలోవ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, సోమాదుల సురేష్, సంఘ అధ్యక్షులు కొట్నాన రవి, సంఘ ఉపాధ్యక్షులు అనపర్తి ఎల్లయ్య, రాజు, అప్పారావు, చింతాడ వాసు, చిన్నారావు, వేణు, సన్యాసిరావు పాల్గొన్నారు.
- హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంస్థ మెయిన్ గేటు వద్ద జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ జీఎం పీడీ అశోక్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ ఆఫీసర్ పి.శేఖర్ ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. సంఘ అధ్యక్షుడు అప్పలకొండ, సెక్రటరీ అనిల్‌కుమార్, గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, ఇతర నాయకులు కొండలరావు, పవన్‌కుమార్, రవికుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్‌నగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్లు కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు



బాబూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు



షిప్‌యార్డ్ గేటు వద్ద జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు

ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



స్వరాజ్యం వెంకట రమణమ్మ

సీతంపేట: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు నగరానికి చెందిన కొల్లూరు స్వరాజ్యం వెంకట రమణమ్మకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక ఈ నెల 9, 10 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని బాలబాట పిల్లల మాస పత్రిక సంపాదకురాలు రమణమ్మను ఆహ్వానించారు. ఈమేరకు శ్రీశ్రీ కళా వేదిక నుంచి ఆహ్వానం అందినట్టు బుధవారం ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని కవితాగానం చేయనున్నట్టు చెప్పారు. తను రచించిన 'స్వరాజ్య స్వరాలు' లలిత సంగీత గీతాల పుస్తకాన్ని ఆ వేదికపై అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులు

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధిలోని వాకర్స్ క్లబ్ సభ్యులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్‌పీ రవీంద్ర ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధి 10 ఉమ్మడి జిల్లాల్లోని 1400 క్లబ్‌ల్లో సభ్యులుగా నమోదైన వారందరికీ గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు.

పబ్లిక్ డిమాండ్

కొబ్బరి చెట్లతో ఇబ్బందులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మసీద్ వీధికి ఇరువైపులా గల కొబ్బరి చెట్ల వల్ల పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. కొబ్బరి బొండాలు ఎక్కడ వారి తలపై పడతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ నెట్ అమర్చాలని పాదచారులు కోరుతున్నారు.



మసీద్ వీధిలో రోడ్డుకు ఇరువైపులా కొబ్బరి చెట్లు